సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 20 । జనవరి । 2023



జగన్ సీఎంగా ఉంటేనే వ్యవస్థల మనుగడ

జగన్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా మళ్లీ కొనసాగితేనే రాష్ట్రంలోని వ్యవస్థలు మనుగడలో ఉంటాయని జెడ్పీచైర్మన్ ఆకేపాటి అన్నారు. - 8లో



సౌమ్యనాథాలయ అభివృద్ధిపై దృష్టి

సౌమ్యనాథాలయంలో అభివృద్ధి పనులపై దృష్టి సారించామని టీటీడీ జేఈవో వీర బ్రహ్మం పేర్కొన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.150	రూ.248

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 140 మెట్రిక్ టన్నులు





ఉభయ దేవేరులతో దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి



దేవుని కడప ఆలయ ప్రాంగణం

అపర వైకుంఠం

- శ్రీనివాసుని ప్రతిరూపం కడప రాయుడి ఆలయం
- అడుగు పెట్టగానే ఆధ్యాత్మిక చింతన
- జిల్లా ఆధ్యాత్మిక క్షేత్రాల్లో తొలి స్థానం
- తిరుమలకు వెళ్లే ముందు ఇక్కడే మొక్కుబడి
- మత సామరస్యానికి ప్రతీకగా దేవదేవుని ఆలయం

కడప కల్చరల్ : ఆ ప్రాంగణంలో అడుగు పెట్టగానే ఏదో తెలియని తన్మయత్వం. అపర వైకుంఠమైన తిరుమలేశుని తొలి గడపగా భావిస్తున్న కడప రాయుడిని ఆ ప్రాంగణంలో దర్శించుకున్న మరుక్షణం బాధలన్నీ తొలగిపోయిన భావన. మనసు తేలికపడిన ఆనందం. కొత్తశక్తి లభించినట్లు అనిపిస్తుంది. అందుకే ఈ ఆలయం రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలలో ఒకటిగా, పర్యాటక ప్రాంతాలలో మొదటి వరుసలో ఉంది. కడప నగరంలోని దేవునికడపలోగల శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు ఈనెల 21న శనివారం అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి.

- రాష్ట్రంలో వైఎస్సార్ జిల్లాలోని దేవుని కడప శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఎంతో విశిష్టమైన స్థానముంది. ప్రముఖ పర్యాటక క్షేత్రాల్లో ముందు వరుసలో నిలిచే ఈ ప్రాంతానికి చారిత్రకంగా కూడా ప్రాధాన్యత ఉంది.

తిరుమలకు వెళ్లే ముందు..

దేవదేవుడు శ్రీనివాసుని ప్రతిరూపం కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరుడు. ఆ బ్రహ్మాండ నాయకుడి క్షేత్రం దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం వైకుంఠాన్ని తలపిస్తోంది. తిరుమలకు తొలిగడపగా భావిస్తున్న ఈ పవిత్ర క్షేత్రంలో కొలువై ఉన్న కడప రాయుడిని పూజిస్తే సాక్షాత్తు తిరుమలేశుడిని పూజించినట్లేనని చెబుతారు. తిరుమలకు వెళ్లే ముందుగా ఈ ప్రాంతానికి చెందిన భక్తులు స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఉత్తర ప్రాంతం నుంచి తిరుమలకు వెళ్లే భక్తులు కడప నగరంలోని ఈ క్షేత్రంలో విశ్రమించి అనంతరం స్వామిని దర్శించుకుని తిరుమలేశుని సన్నిధికి బయలుదేరే వారని తెలుస్తోంది. నేటికీ తిరుమలకు వెళ్లలేని వారు కడప రాయుని సన్నిధిలోనే మొక్కులు చెల్లించుకుంటున్నారు.

ఆలయంలో

గర్భాలయం ఎదురుగా రంగమండపం పూర్తి స్థాయి శిల్ప సంపదతో అలరారుతోంది. భక్తులు కొద్దిసేపైనా ఆ ప్రాంగణంలో కూర్చొని ప్రశాంతత పొందాలని ఆశిస్తుంటారు. ఆలయంలో ఉత్తరం వైపున ప్రహరీకి దగ్గరగా చెట్టు కింద నాగుల విగ్రహాలున్నాయి. ఆ పక్కనే స్వామికి సర్వసేనాని విశ్వక్సేనుని మందిరం, శ్రీ గణపతి మందిరం ఉంది. ఈ రెండు దక్షిణ ముఖంగా ఉన్నాయి. తర్వాత ఉత్తర ద్వారం దగ్గరగా శ్రీ ఆండాల్ తాయారు అమ్మవారి మందిరం పడమర ముఖంగా ఉంది. ఈ మందిరాల మండపాలు, గోడలు శిల్పమయమై కనువిందు చేస్తున్నాయి. స్వామి దర్శనానికి ముందు భక్తులు ఇక్కడ కూడా పూజలు చేస్తారు.

పాద మండపం



రాజగోపురం నుంచి ఆలయంలోకి అడుగు పెట్టగానే ఎదురుగా పాద మండపం కనిపిస్తుంది. ఇందులో శ్రీవారి పాదాలున్నాయి. ఈ పాదాలపై ప్రస్తుతం ఇత్తడి తొడుగు ఉంది. భక్తులు తొలుత పాదాలను దర్శించుకుని ప్రదక్షిణలు చేసి ఆ వెనుకే గల బలిపీఠం వద్ద కొబ్బరికాయలు సమర్పిస్తారు. ఆ వెనుక రంగమండపం ఎదుటగల జ్యోతి మందిరంలో దీపం వెలిగించి మొక్కుకుంటారు. ఆలయానికి దక్షిణ గోపురం వద్ద ప్రహరీకి ఆనుకుని పెద్ద హాలులో దాదాపు పది మంది ఆళ్వార్ల విగ్రహాలు ఉన్నాయి. ఇదే మందిరంలో అత్యంత పురాతనమైన శ్రీ చెన్నకేశవస్వామి మూర్తి ఉంది. స్వామిని దర్శించుకున్న అనంతరం భక్తులు చెన్నకేశవునితోపాటు ఆళ్వార్లకు పూజలు నిర్వహిస్తారు. ఉత్తరద్వారం వైపు జమ్మిచెట్టు ఉంది. భక్తులు దీనికి ప్రదక్షిణలు చేసి సంతానం కోసం మొక్కుకుంటారు.

బంగారు బల్లి



కంచి ఆలయానికి వెళ్లిన వారు అక్కడి బంగారు బల్లిని తాకి దోష నివారణ చేసుకునేందుకు ప్రయత్నిస్తారు. ఆ తర్వాత అలాంటి అవకాశం కడప రాయుని ఆలయంలో మాత్రమే ఉంది. ఇక్కడి అమ్మవారి ఆలయం ద్వారం వద్ద పైకప్పులో రెండు రాతి బల్లులు ఇత్తడి తొడుగుతో కనిపిస్తాయి. కంచికి వెళ్ల(లే)ని వారు, వెళ్లినా అక్కడి ఆలయంలో బల్లులను తాకని వారు కడప రాయుని ఆలయంలోగల బల్లులను తాకి తృప్తి పొందుతారు. అమ్మవారి దర్శనానంతరం భక్తులు తప్పక ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

మత సామరస్యం

కడప రాయుని ఆలయం మత సామరస్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. సంవత్సరం పొడవునా కడప నగరానికి చెందిన వారే కాకుండా సమీప గ్రామాలకు చెందిన పలువురు ముస్లిం భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారు. అమ్మవారిని తమ ఆడబిడ్డ బీబీ నాంచారిగా భావించి లాంఛనాలు సమర్పించుకుంటారు. ముఖ్యంగా ఉగాది నాడు పెద్ద సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహిస్తారు.

రేపటి నుంచి కడప రాయుడి బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : తిరుమల తొలిగడపగా భావించే కడప రాయడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు జనవరి 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానాల జేఈఓ వీరబ్రహ్మయ్య తెలిపారు. గురువారం స్వామి సన్నిధిలో ఆయన బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు, ఇతర సామగ్రిని అర్చకులు, స్థానిక అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ప్రతిరోజు ఉదయం 9.00 నుంచి 10.00 గంటల వరకు వివిధ పూజలు, వాహన సేవ, 10.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు దీక్షా తిరుమంజనం, స్నపన తిరుమంజనం, సాయంత్రం 6.00 నుంచి రాత్రి 7.00 గంటల వరకు సాయంత్రపు ఉత్సవాలు, అదే సమయంలో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సంకీర్తనలు, రాత్రి 7.00 నుంచి 8.00 గంటల వరకు వివిధ వాహనాల ఉత్సవాలు, 7.00 నుంచి 9.00 గంటల వరకు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు హరికథ నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఉత్సవాల వివరాలిలా ఉన్నాయి.

తేది	ఉదయం సేవలు	రాత్రి వాహన సేవ
21.01.2023	దీక్షా తిరుమంజనం	సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం
22.01.2023	తిరుచ్చి, ధ్వజారోహణం	చంద్రప్రభ వాహనం
23.01.2023	సూర్యప్రభ వాహనం	పెద్దశేష వాహనం
24.01.2023	చిన్నశేష వాహనం	సింహవాహనం
25.01.2023	కల్పవృక్ష వాహనం	హనుమంత వాహనం
26.01.2023	ముత్యపుపందిరి వాహనం	గరుడ వాహనం
27.01.2023	కల్యాణోత్సవం	గజవాహనం
28.01.2023	రథోత్సవం	ధూళి ఉత్సవం
29.01.2023	సర్వభూపాల వాహనం	అశ్వ వాహనం
30.01.2023	వసంతోత్సవం, చక్రస్నానం	హంస వాహనం, ధ్వజావరోహణం
31.01.2023	--	పుష్పయాగం

పకడ్బందీ ఏర్పాట్లు

ఈ సందర్భంగా టీటీడీ జేఈఓ వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు కడపరాయని బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, అందు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల నిర్వహణ విషయంగా అన్ని శాఖలతోనూ ప్రత్యేక సమీక్ష నిర్వహించామన్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వాహన సేవలు ఉంటాయని, ముఖ్యంగా 26వ తేదీ గరుడ వాహన సేవకు భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారన్నారు. 28న రథోత్సవం ఉంటుందని తెలిపారు. ఇందులో భాగంగా రథం ఫిట్‌నెస్ కూడా పరిశీలించామని, ఈ ఉత్సవాలకు భక్తులు ఎంత మంది వస్తారన్న అంచనాతో గట్టి చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్‌బాబు, సూపరింటెండెంట్ వెంకటేశ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, విజిలెన్స్, సెక్యూరిటీ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మయ్య, ఇతర అధికారులు, అర్చకులు

సమష్టి కృషితో సమగ్రాభివృద్ధి

రాయచోటి: సుస్థిర సమగ్రాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు అధికారులందరూ సమష్టిగా, సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి రీసర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, స్పందన గ్రీవెన్స్, ఏపీఐఐసీ భూముల మ్యుటేషన్స్, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధకం, మత్స్య శాఖ, గృహ నిర్మాణంలో ఇంటి స్థలాలు, ఇళ్ల నిర్మాణం, గ్రామ వార్డు సచివాలయాలు, గడప గడపకు మన ప్రభుత్వం తదతర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలను పటిష్టవంతంగా అమలు చేస్తూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు సంతృప్త స్థాయిలో అందించేలా కృషి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. 2022–23 రబీ ఈ క్రాప్‌ను, పీఎం కిసాన్ ఈకేవైసీ కార్యక్రమాలను పటిష్టవంతంగా పూర్తి చేయాలన్నారు. డీఆర్‌ఓ సత్యనారాయణ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

గెస్ట్ హౌస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

గెస్ట్‌హౌస్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వెనుక భాగంలో నిర్మిస్తున్న గెస్ట్ హౌస్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనులలో నాణ్యత లేకుంటే రాజీపడరాదని అధికారులకు చెప్పారు.

ఈ నెల 23 నుంచి భాషా పండితుల పరీక్షలు

రాయచోటిటౌన్ : ఈ నెల 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు భాషా పండితుల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్లు www.br-e.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

రాయచోటిటౌన్: చేపల వ్యాపారులు ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తెలిపారు. గురువారం మెప్మా కార్యాలయంలో మత్స్యశాఖ ఏడీ సుశ్మిత ఆధ్వర్యంలో చేపల వ్యాపారులకు అవగాహన కల్పించారు. బ్యాంకు అందించే రుణంలో 40శాతం సబ్సిడీ ఉంటుందన్నారు.

సామాన్యులకు అర్థమయ్యేలా వేమన పద్యాలు

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : సామాన్య ప్రజలకు అర్థమయ్యే భాషలో పద్యాలు రాసి సాహిత్యాన్ని సమాజానికి చేరువ చేసిన ఘనత యోగి వేమనకు దక్కుతుందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. గురువారం విశ్వకవి యోగివేమన జయంతి సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాకవి యోగివేమన తెలుగు సాహితీరంగానికి అందించిన పద్యాలు గొప్ప సంపదన్నారు. సామాన్య ప్రజలకు అర్థమయ్యే వాడుక భాషలో అద్భుతమైన కవిత్వం అందించి సామాజిక రుగ్మతలపై, సమాజ సంస్కరణకు కృషి చేసిన గొప్ప దార్శనికుడు అన్నారు. తెలుగు భాషను, భావాన్ని ప్రజలకు చేరువ చేసిన ఘనత వేమనకే దక్కుతుందన్నారు. వేమన ప్రతి రంగాన్ని నిశితంగా పరిశీలించి అప్పటి సమాజంలో జరిగే అన్యాయాలు, అక్రమాలపై తనదైన శైలిలో నిర్భయంగా నిజాయితీగా వర్ణించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమూర్తి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ శ్రావణి, పాల్గొన్నారు.



వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

తెలుగు వారి గుండెల్లో వేమనకు సుస్థిర స్థానం

తెలుగు వారి గుండెల్లో యోగి వేమన సుస్థిరస్థానాన్ని సంపాదించుకున్నారని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. వేమన జయంత్యుత్సవాల సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదనపు ఎస్పీ(అడ్మిన్) వి.బి. రాజ్‌కమల్, డీఎస్పీలు మహబూబ్ బాషా, సుధాకర్, శ్రీనివాస్‌రావులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.



వేమన చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తెలుగు సాహిత్య వెలుగురేఖ యోగివేమన: డీఈఓ రాఘవరెడ్డి

రాయచోటి అర్బన్: జీవిత సత్యాలను, మానవతా విలువలను పామరుడి నుంచి పండితుల వరకు అందరికీ అర్థమయ్యేలా సరళంగా, స్పష్టంగా పద్యాలు రచించిన యోగివేమన తెలుగు సాహిత్యానికి వెలుగురేఖ అని డీఈఓ వై.రాఘవరెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఆయన తన కార్యాలయంలో యోగివేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుష్టసంప్రదాయాలను, మూఢాచారాలను, విగ్రహారాధనలను, మతమౌఢ్యాలను, మహిళలకు జరుగుతున్న అన్యాయాలతో పాటు సమాజానికి హానికలిగించే ప్రతి అంశంపై ఆటవెలదులనే ఈటెలతో సూటిగా, ఘాటుగా స్పందించి ప్రజలను ఉత్తేజితులను చేశారంటూ కొనియాడారు. తెలుగుజాతి ఉన్నంత కాలం వేమనపద్యాలు ప్రజల నాలుకపై నిలిచే ఉంటాయన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నేత శ్రీనివాసరాజు, సంబేపల్లె జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్‌రావు, నరసింహులు, ఎంఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

రాయచోటి: విద్యార్థులలో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవరెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన రాయచోటి మండలం బోయపల్లి, ఇ.అబ్బవరం, ముసలిరెడ్డిగారిపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన సంగ్రహణాత్మక మూల్యాంకనంలో వందశాతం ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించాలన్నారు. అలాగే సామర్థ్యాల వారిగా ప్రతి విద్యార్థి ప్రతిభను విశ్లేషించాలన్నారు.



యోగివేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఈఓ, విద్యాశాఖ అధికారులు

సమాజానికి దిశానిర్దేశం చేసిన సంఘ సంస్కర్త



వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, తదితరులు

వైవీయూ: వాస్తవిక ప్రపంచాన్ని కళ్ల ముందుంచి, సమాజానికి దిశా నిర్దేశం చేసిన సంఘ సంస్కర్త, విశ్వకవి వేమన అని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగ జనార్దన్ అన్నారు. గురువారం వైవీయూలో 'వేమన జయంతి ఉత్సవం' ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్, మానవీయ శాస్త్రాల డీన్ ఆచార్య టి. రామప్రసాద్‌రెడ్డి, మైసూరులోని కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం పీఠాధిపతి ఆచార్య ఎం. రామనాథంనాయుడులు వేమన, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, డాక్టర్ వైఎస్ఆర్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత విశ్వవిద్యాలయ పరిపాలన భవనం నుంచి అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు చైతన్య ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ట్స్ బ్లాక్‌లోని సెమినార్ హాల్‌లో తెలుగుశాఖ విభాగాధిపతి ఆచార్య జి. పార్వతి అధ్యక్షతన జరిగిన సభలో వైస్ చాన్సలర్ మాట్లాడారు. విద్యార్థులు వేమన పద్యాలను చదవడం కాకుండా, దైనందిన జీవితానికి అన్వయించుకోవాలన్నారు.

రైతులకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- మూడున్నర ఏళ్లుగా పండుగలా వ్యవసాయం
- విత్తనం నుంచి విక్రయం వరకు ఆర్‌బీకేల ద్వారానే సేవలు
- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి
- విజయవంతమైన కిసాన్ మేళా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

కడప అగ్రికల్చర్: రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని.. గత మూడున్నర ఏళ్లుగా వ్యవసాయం పండుగలా సాగుతోందని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో కిసాన్‌మేళాను ఘనంగా నిర్వహించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(గుంటూరు) పరిశోధన సంచాలకులు డాక్టర్ ప్రశాంతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వ్యవసాయ సాగులో రైతులకు ఖర్చులు తగ్గించి అధిక దిగుబడులను సాధించే విధంగా కొత్త టెక్నాలజీని తేవాలన్నారు. చాలా దేశాల్లో ఆధునిక టెక్నాలజీతో తక్కువ ఖర్చుతో అధిక విస్తీర్ణంలో పంటలను సాగు చేస్తున్నారన్నారు. వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గడిచిన మూడున్నర ఏళ్లలో రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగలా చేస్తున్నారన్నారు. విత్తనం నుంచి విక్రయం వరకు, ఎరువుల నుంచి పురుగు మందుల వరకు అన్ని రకాల సేవలు నేడు ఆర్‌బీకేల ద్వారా జరుగుతున్నాయన్నారు. పంటలకు ముందే మద్దతు ధరను ప్రకటించి అడుగడుగునా రైతులను ఆదుకుంటోందన్నారు. ప్రభుత్వ ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తక్కువ ఖర్చులతో ఎక్కువ ఆదాయం పొందే విధంగా ఆర్‌బీకేల ద్వారా సేవలందిస్తున్నామన్నారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రగతి పరంగా 2019లో 31వ స్థానం నుంచి ఈ రోజు 11వ స్థానంలో నిలిచిందన్నారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ సుకుమార్, కమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లారెడ్డి, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ రాజశేఖర్, వైఎస్సార్ జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, కోడూరు జెడ్పీటీసీ రత్నమ్మ, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసఆచారి, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మురళీకృష్ణ, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వీరయ్య, ఆత్మ పీడీ విజయలక్ష్మి, ఉద్యానశాఖ ఏడీ సుభాషిని, వ్యవసాయశాఖ ఏడీలు నరసింహారెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వారు రూపొందించిన ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపైన ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే డ్రోన్ వినియోగంపై డెమోను నిర్వహించారు.

క్లుప్తంగా

కడప మీదుగా ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కడప మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నట్లు కడప రైల్వే కమర్షియల్ ఇన్స్పెక్టర్ ఉమర్‌బాషా తెలిపారు. కాచిగూడ-తిరుపతి (07797/98) మధ్య ఈనెల 20, 21 తేదీల్లో నడిచే ఈ రైలు ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల్, కర్నూలుసిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుందన్నారు. వీటిలో టూ టైర్, త్రీ టైర్, స్లీపర్ క్లాస్, జనరల్ బోగీలు ఉంటాయన్నారు. అలాగే వారానికి ఒకరోజు నడిచే తిరుపతి-జాల్నా (07413/14) రైలు ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 28 వరకు పొడిగించినట్లు చెప్పారు. జాల్నా నుంచి తిరుపతి ప్రతి ఆదివారం నడిచే రైలు మార్చి 5వ తేదీ వరకు పొడిగించారన్నారు. ఈ రైలు ప్రతి మంగళవారం తిరుపతిలో, ఆదివారం జాల్నాలో బయలుదేరుతుందన్నారు. ప్రయాణికులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు ఆయన వివరించారు.

రాజంపేట డిపోకు రూ.15,74,077 ఆదాయం


మాట్లాడుతున్న డీఎం రమణయ్య

రాజంపేట : సంక్రాంతి రిటర్న్ ట్రాఫిక్‌లో రాజంపేట డిపోకు రూ.15,74,077లక్షల ఆదాయం సాధించి జిల్లాలో ప్రథమ స్థానం డిపోగా నిలిచిందని డిపో మేనేజరు రమణయ్య తెలిపారు. బుధవారం తన చాంబులో విలేకర్లతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఐదు డిపోలు ఉన్నాయన్నారు. పండు సందర్భంగా తిరుగుప్రయాణంలో 18న ఒక్క రోజే ఓఆర్ వందశాతం వచ్చిందన్నారు. ఎర్నింగ్‌ఫర్ కిలోమీటర్ రూ. 56.40 వచ్చిందన్నారు. ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషితోనే ఓర్ (ఆక్యుపెన్సీ రేషియో) పెంచగలిగామన్నారు. జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఓఆర్ తెచ్చిన వారికి బహుమతి అందజేసినట్లు చెప్పారు.

సౌమ్యనాథాలయ అభివృద్ధిపై దృష్టి

- టీటీడీ జేఈవో వీరబ్రహ్మం
- కేంద్రపురావస్తుశాఖతో టీటీడీ సంప్రదింపులు


జేఈవో వీరబ్రహ్మంతో మాట్లాడుతున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

రాజంపేట : సౌమ్యనాథాలయంలో అభివృద్ధి పనులపై దృష్టి సారించామని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం పేర్కొన్నారు.గురువారం ఆయన సౌమ్యనాథస్వామిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేపట్టే విషయంలో కేంద్రపురావస్తుశాఖ ఉత్తర్వుల కోసం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. జేఈవోతో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం జేఈవో మాట్లాడుతూ సౌమ్యనాథాలయం టీటీడీలో విలీనమైన తర్వాత అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఆలయానికి సంబంధించి కోనేరును బాగు చేయిస్తామన్నారు. నందలూరు ముఖద్వారంతోపాటు అభివృద్ధి పనులపై దృష్టి సారించామన్నారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ టీటీడీ ఆలయ అభివృద్ధి విషయంలో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. విలీనం తర్వాత ఆలయానికి ఒంటిమిట్ట తరహాలో మహర్దశ కలిగేలా టీటీడీ అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు కలీం, వైఎస్సార్‌సీపీ నాయకులు నడివీధిసుధాకర్, తుమ్మల శ్రీధర్‌గౌడ్, మన్సూర్‌అలీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో జెఈవో కలియతిరిగారు. ఉల్లంఘేశ్వరాలయం సమీపంలోని సౌమ్యనాథుని కోనేరు దుస్థితిని పరిశీలించారు.

భక్తులకు సౌకర్యంగా అన్నమయ్య థీంపార్కు

భక్తులకు సౌకర్యంగా అన్నమయ్య థీంపార్కు(108 అన్నమయ్య అడుగుల ప్రదేశం)ను తీర్చిదిద్దుతామని జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. గురువారం థీంపార్కులో జరుగుతున్న శ్రీవారి ఆలయ నిర్మాణపనులను ఆయన పరిశీలించారు. జాతీయరహదారిలో భక్తులు దర్శించుకునేలా శ్రీవారి ఆలయం నిర్మించాలన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు అవసరమయ్యే సౌకర్యాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో టీటీడీ ఈఈ సుమతి, డీఈ చంద్రశేఖర్, డీఎఫ్ఓ శ్రీనువాసులు, డిప్యూటీ ఈవోలు నటేష్‌బాబు, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

రామాలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఒంటిమిట్ట(సిద్దవటం): ఏకశిలా నగిరి శ్రీ కోదండరామస్వామి ఆలయం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం అన్నారు. దేవుని కడప బ్రహ్మోత్సవాలకు వెళుతూ మార్గమధ్యలో శ్రీ కోదండరామస్వామి ఆలయం అభివృద్ధిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కోదండ రామస్వామి బ్రహోత్సవాలు సమీపిస్తున్నాయని భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ అభివృద్ధికి రూ. 6కోట్లు మంజూరైనట్లు చెప్పారు.కల్యాణ వేదిక ప్రాంతాన్ని పరిశీలించారు. బ్రహోత్సవాల పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, రామరాజు, ఈఈ సుమతి, ఏఈ అమర్‌నాథ్‌రెడ్డి, రవిబాబు, టీటీడీ అధ/కారులు పాల్గొన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ప్రస్తుతం 250 మందికి అన్నదానాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆ సంఖ్యను 400కు పెంచాలని, శని, ఆదివారాల్లో 600 మందికి అన్నప్రసాదాలు అందించాలని డిప్యూటీ ఈఓ నటేష్ బాబును ఆదేశించారు

లోకాయుక్త విచారణకు సాయంగా తహసీల్దార్, డీఎల్‌సీఓ

కలెక్టర్ ఆదేశాలు జారీ

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై హార్సిలీహిల్స్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటికి ప్రభుత్వం విక్రయించిన భూములపై లోకాయుక్త విచారణ సాగుతున్న విషయం తెలిసిందే. భూముల స్థితిగతులపై విచారణ చేపట్టాలని లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఆదేశాలిస్తూ విచారణ అధికారిగా డిప్యూటీ డైరెక్టర్ గంగరాజును నియమించారు. ఆయన ఇప్పటికే దర్యాప్తు చేపట్టి క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారున్ని విచారించి వివరాలను సేకరించారు. ఇందులో ఎన్నో చిక్కుముళ్లు, కోర్టుకేసులు, వివాదాలు, అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు ఉండటంతో విచారణ పూర్తిస్థాయిలో జరిపి నివేదిక రూపొందించడం కోసం లోకాయుక్త విచారణ అధికారి గంగరాజు అధికారుల సహకారం కోరుతూ కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై కలెక్టర్ విచారణ అధికారికి సహాయంగా ఉండేందుకు బి.కొత్తకోట తహసీల్దార్ ధనుంజయులు, మదనపల్లె డీఎల్‌సీఓ శ్యామ్ ప్రకాష్‌రెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

అత్తింటి వారే చంపేశారంటూ మృతురాలి బంధువుల ఆందోళన


అమృత (ఫైల్)


రామసముద్రం పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

రామసముద్రం : కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామసముద్రం మండలంలో గురువారం జరిగింది. విషయం తెలుసుకున్న బంధువులు రామసముద్రం పోలీస్‌స్టేషన్ ముందు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. దీంతో రోడ్డుపై సుమారు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. వివరాలిలా ఉన్నాయి. పెద్దపంజాణి మండలం మాదనపల్లె పంచాయతీ చీమనపల్లె గ్రామానికి చెందిన అన్నయ్య, లక్ష్మీదేవిలకు కుమార్తె అమృత(19), కుమారుడు అశోక్ ఉన్నారు. అన్నయ్య మూగవాడు. లక్ష్మీదేవి కన్నులు సరిగా కనిపించవు. కాగా మూడేళ్ల క్రితం అమృతను రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ బల్లసముద్రంకు చెందిన పాపన్న, రెడ్డెమ్మల కుమారుడు గణేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. అయితే గణేష్‌కు తండ్రి లేకపోవడంతో తల్లితో కలసి ఉన్నాడు. ఈ నేపథ్యంలో గత శనివారం కుటుంబంలో గొడవలు పడ్డారు. అప్పటి నుంచి అమృత కనిపించకుండా పోయిందని గణేష్ పుట్టింటి వారికి సమాచారం అందించాడు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గురువారం ఉదయం బల్లసముద్రం సమీపంలో ఉన్న సుంకర వానికుంటలో అమృత శవమై కనిపించింది. మదనపల్లె సీఐ శివాంజనేయులు , ఎస్‌ఐ రవీంద్రబాబులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. అత్తింటివారు తమ బిడ్డను చంపేసి చెరువులో వేసి నాటకాలాడుతున్నరని, ఆగ్రహిస్తూ మృతురాలి బంధువులు రామసముద్రం పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ బిడ్డను చంపేసిన అత్త, భర్తను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఒకనొక దశలో స్టేషన్‌లోనికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో వారిని అదుపు చేశారు పెద్దల ప్రమేయంతో ఆందోళన విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు.

వరకట్న వేధింపులపై మహిళ ఫిర్యాదు

మదనపల్లె : ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త.. అదనపు కట్నం తేవాల్సిందిగా భార్యను వేధింపులకు గురిచేస్తూ.. ఇంటి నుంచి గెంటేసిన వైనం పట్టణంలోని బాలాజీనగర్‌లో జరిగింది. ఈ ఘటనపై ఆమె టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయడంతో భర్త, తల్లిదండ్రులు, ఆడపడుచుపై గురువారం కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. కురబలకోటకు చెందిన షేక్ సితార ఏడాదిన్నర క్రితం మదనపల్లె బాలాజీనగర్‌కు చెందిన షేక్ రయాన్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. పెళ్లి సమయంలో 100 గ్రాముల బంగారం, రూ.30,000 నగదును వరకట్నం రూపంలో భర్త, అత్తామామలకు అందించింది. రయాన్ కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. నెలరోజులు సజావుగా సాగిన వీరి కాపురంలో అత్తామామ, ఆడపడుచు, భర్త అదనపు కట్నం తేవాలని సితారను వేధించడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. పుట్టినింటికి వెళ్లి తాను డబ్బులు తీసుకురాలేనని చెబితే.. సరైన ఆహారం పెట్టకుండా, కనీస అవసరాలు తీర్చకుండా వేధింపులకు గురిచేసేవారని వాపోయింది. ఈ విషయమై కులపెద్దలకు, బంధువులకు చెప్పుకుంటే వారు పంచాయతీ చేసి రాజీ కుదిర్చి కాపురానికి పంపారన్నారు. అయినప్పటికీ భర్త, అత్తామామల ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. ఇంటిలో నుంచి బయటకు గెంటివేసి అదనపు కట్నం తీసుకురావాల్సిందిగా ఒత్తిడి పెంచారని వాపోయింది. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో పోలీసులను ఆశ్రయించి భర్త రయాన్, అత్త షేక్ హసీనా, మామ షేక్ జావీద్ హుస్సేన్, ఆడపడుచు షేక్ పజీలాలపై ఫిర్యాదుచేసినట్లు తెలిపింది. బాధితురాలి ఫిర్యాదుమేరకు సెక్షన్.498ఏ కింద కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని విద్యార్థి ఆత్మహత్య


సాయిచరణ్ నాయక్ మృతదేహం

కలకడ : ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం కలకడ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తిప్పేస్వామి కథనం మేరకు వివరాలు.. మండలంలోని ఎనుగొండపాల్యెం పంచాయతీ ఎగువతాండకు చెందిన బుక్కే ప్రసాద్ నాయక్ కుమారుడు బుక్కే సాయి చరణ్ నాయక్ (16) పీలేరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇతను కళాశాలకు సరిగా వెళ్లడంలేదు. దీంతో కుటుంబ సభ్యులు మందలించారు. మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలి పనికి వెళ్లిన తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా ఉరికి వేలాడున్న కుమారుడిని చూసి బోరున విలపించారు. తర్వాత మృతదేహాన్ని కిందకు దించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి ప్రసాద్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిప్పేస్వామి తెలిపారు. సాయిచరణ్ నాయక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పారు.

అప్పులబాధతో ఆత్మహత్య

రాయచోటిటౌన్ : అప్పుల బాధ తాళలేక సుంకారపు నిర్మల (46) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. రాయచోటి పట్టణంలోని జగదాంబ సెంటర్ సమీపంలో ఈమె చిల్లరకొట్టు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆమె భర్త కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ఇంటికి దూరంగా ఉంటున్నాడు. చిన్నకొడుకు మహేష్‌కుమార్‌తో కలసి కొట్టు నిర్వహిస్తోంది.ఈ క్రమంలో బుధవారం రాత్రి ఏమి జరిగిందో తెలియదు కానీ ఇద్దరు కలసి విషద్రావణం తాగారు. గురువారం తెల్లవారుజామున ఆమె అపస్మారకస్థితిలో పడి ఉంది. కుమారుడు బయటికి వచ్చి వాంతులు చేసుకోవడంతో స్థానికులు గమనించారు. ఇద్దరినీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మహేష్‌కుమార్‌కు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. అప్పుల బాధ తాళలేకే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు మహేష్‌కుమార్ పోలీసులకు తెలిపారు.దీనిపై పూర్తి స్థాయి విచారణ సాగిస్తున్నామని పోలీసులు చెప్పారు.

ఉరి వేసుకుని..

సిద్దవటం: మండలం లోని లంకమల అడవిలో వెలసిన శ్రీ నిత్యపూజస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తి (45)ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారని ఎస్‌ఐ తులసీ నాగ ప్రసాద్ తెలిపారు. గురువారం ఎస్‌ఐ మాట్లాడుతూ మృతుడు గ్రీన్‌కలర్ నిక్కర్ ధరించి ఉన్నారు. ఈ వ్యక్తి వివరాలు తెలిసిన వారు ఒంటిమిట్ట సీఐ 9121100581, సిద్దవటం ఎస్‌ఐ 9121100584 నంబర్‌లకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ తెలియజేశారు.

చంపుతామని బెదిరిస్తున్నారు!

పోలీసులకు ఫిర్యాదు చేసిన డాక్టర్ మోహన్‌రెడ్డి

బత్తలపల్లి : తనను, తన కుటుంబాన్ని హతమారుస్తామంటూ దాయాదులు బెదిరిస్తున్నారని పోలీసులకు అన్నమయ్య జిల్లా పీలేరు మండలం దేవలవారిపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ రెడ్డి మోహన్‌రెడ్డి గురువారం ఫిర్యాదు చేశారు. బత్తలపల్లిలో నివాసముంటూ స్థానిక ఆర్డీటీ ఆస్పత్రిలో 19 ఏళ్లుగా ఆయన వైద్య వృత్తిలో కొనసాగుతున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. డాక్టర్ రెడ్డి మోహన్‌రెడ్డి కుటుంబానికి స్వగ్రామంలో వ్యవసాయ భూమి ఉంది. తల్లి రెడ్డమ్మ అక్కడే నివసిస్తూ వ్యవసాయ పనులు చేయిస్తోంది. ఈ క్రమంలో భూమికి సంబంధించి దాయాదులతో ఘర్షణ నెలకొనడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ వివాదం ప్రస్తుతం కోర్టులో నడుస్తోంది. గత ఏడాది డిసెంబర్ 13న సాయంత్రం ద్వారకానాథరెడ్డి అనే వ్యక్తి ఫోన్ చేసి, తన కుటుంబాన్ని హతమారుస్తానంటూ జయరామిరెడ్డి, ఆనందరెడ్డి ప్రోద్బలంతో బెదిరించాడు. అంతేకాక 'నాపై ఇప్పటికే 13 కేసులున్నాయి. మిమ్మల్ని చంపితే నాకు 14 కేసు అవుతుంది' అంటూ మోహన్‌రెడ్డిని బెదిరించారు. మోహన్‌రెడ్డి పిల్లలు ఇతర రాష్ట్రంలో విద్యాభ్యాసం చేస్తున్నారు. చెల్లెలు సైతం ఇతర రాష్ట్రంలో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో దాయాదులతో తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందంటూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు


ట్రోఫీని అందజేస్తున్న శరత్‌కుమార్‌రాజు

రాజంపేట రూరల్ : క్రీడలలో రాణించిన యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శరత్‌కుమార్‌రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని మదనగోపాలపురంలో ఎంజీపురం యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపీఎల్(మదన గోపాలపురం ప్రీమియర్ లీగ్) పోటీలు గురువారం ముగిశాయి.ఇందులో గెలుపొందిన జట్లకు శరత్‌కుమార్‌రాజు స్థానిక ఎంపీటీసీ మధుబాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొండూరు విశ్వనాథ్‌రాజుతో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం శరత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ 11 రోజుల నుంచి నిర్వహించిన ఈ క్రికెట్ పోటీల్లో మండల పరిధిలోని 30 జట్లు పాల్గొన్నాయన్నారు.విజేతగా నిలచిన ఎంజీపురం జట్టుకు రూ.30వేలు, రన్నర్‌గా నిలిచిన సిద్దులపల్లి జట్టుకు రూ.20వేలు, శంకరాపురం జట్టుకు రూ.10వేలు అందజేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీపురం పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, ఉపసర్పంచ్ రుద్రరాజు, ఎంజీపురం ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ సీఎంగా ఉంటేనే వ్యవస్థల మనుగడ

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా మళ్లీ కొనసాగితేనే రాష్ట్రంలోని వ్యవస్థలు మనుగడలో ఉంటాయని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. ప్రకృతి విపత్తులపై కమ్యూనిటీ వలంటీర్లకు గురువారం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టడం ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి ఉన్నత సాంకేతిక విద్యలను అభ్యసించగలిగారని పేర్కొన్నారు. ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నాలుగు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. సచివాలయ ఉద్యోగులను పర్మినెంట్ చేసిన విధంగానే కమ్యూనిటీ వలంటీర్లను కూడా పర్మినెంట్ చేసే అవకాశాలు లేకపోలేదన్నారు. అందుకే జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, మాస్టర్ ట్రైనర్లు, ఆపద మిత్రులు, ఆశా వర్కర్లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌వైకే వలంటీర్లు పాల్గొన్నారు.

మామిడితోటకు నిప్పు: రూ 2లక్షల నష్టం

రామాపురం: మండలంలోని హసనాపురంలో గుర్తుతెలియని వ్యక్తులు మామిడితోటకు నిప్పు పెట్టారు. పోలీసుల కథనం మేరకు హసనాపురం పంచాయతీ చీకటివాండ్లపల్లెకు చెందిన చంద్రమోహన్ 150 మామిడి చెట్లను పెంచుతున్నాడు.బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వీటికి నిప్పు పెట్టడంతో కాలిపోయాయి.దీంతో రూ. 2లక్షల నష్టం జరిగినట్లు బాధితుడు పోలీసులకు తెలియజేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొట్టేలు దొంగతనం కేసులో వ్యక్తి అరెస్టు

రామసముద్రం: పొట్టేలు దొంగతనం కేసులో మూగఎర్రప్పల్లె గ్రామానికి చెందిన నడిపి రెడ్డెప్పను పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని మాలేనత్తం పంచాయతీ మూగఎర్రప్పల్లెలో కాపురం ఉండే వెంకటరమణ తన పొట్టేలును నడిపిరెడ్డప్ప మరొకరి సాయంతో ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పొట్టేలు విలువ రూ. 25 వేలు ఉంటుందని చెప్పారు. ఈమేరకు ఎస్‌ఐ రవీంద్రబాబు మినికి క్రాస్ వద్ద సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా ద్విచక్రవాహనం మీద పొట్టేలును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు.దీంతో నడిమి రెడ్డెప్పను అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుతో అస్వస్థత

మదనపల్లె : పామును పట్టేందుకు వెళ్లిన వ్యక్తి పాముకాటుకు గురై తీవ్ర అస్వస్థతకు చేరుకున్న ఘటన గురువారం మండలంలో జరిగింది. మొలకలదిన్నెకు చెందిన రామయ్య(40) గ్రామంలోని ఓ ఇంటిలో రక్తపింజరి పాము చేరడంతో దాన్ని పట్టుకునేందుకు వెళ్లాడు. పామును చాకచక్యంగా ఒడిసిపట్టుకునే క్రమంలో అది తప్పించుకుని రామయ్యను కాటువేసింది. స్థానికులు అతడిని హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు.

ANDHRAPRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LTD.
DISTRICT OFFICE: RAYACHOTY, ANNAMAYYA DISTRICT.
E-mail Id: dcsm.apscsc.anm@gmil.com

NOTIFICATION

No.P.Admn. /1260/2022 Dated: 07.01.2023

Applications are invited for appointment of Accountant Gr.III on "contract basis" to work in the A.P.State Civil Supplies Corporation Ltd., in Annamayya district for a period of one year.

1	Name of Post and No. of Posts	Accountant Gr.III 1(one) only. (On contract basis)(Open Category)
2	Age limit: (As on 01.01.2023)	(a) General :35Years (b)Reserved : 40Years.
3	Qualifications Prescribed	i) CA/CMA Semi Qualified, ie., Inter Passed. ii)Computer Skills. (No personal Interview)
4	Experience	Two (2) Years experience in relevant field in Govt./Semi Govt. sectors.
5	Monthly Remuneration	Rs.30,000/- (Rupees thirty thousand) per month.
6	Period of Contract	(1) One Year.
7	Local / Non-local (Local: Annamayya district)	Non-local candidates will be considered when local candidates are not available.

Those who are intending to apply for the above post may Send their applications along with copies of testimonials to the "District Civil Supplies Manager), A.P.State Civil Supplies Corporation Ltd., D.No.3/23-B (1st floor), Veeraballi Road, Masapeta, Raychoty-516270" so as to reach on or below 31.01.2023 either by post or in person. Applications received beyond the above date will not be accepted. No enquiries will be entertained in this regard

JOINT COLLECTOR & EOED
APSCSCL, ANNAMAYYA DIST